సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 2 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.14 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.14 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.34

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.34, కనిష్టంగా రూ.24 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,600 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
33.7°/21.9°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 15 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా రెండు స్టాపింగ్‌లు



గుంతకల్లు: నాందేడ్ – ధర్మవరం మధ్య నడస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కోవెలకుంట్ల, ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్లల్లో నిలుపుదలకు (స్టాపింగ్) అనుమతిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్ నుంచి ధర్మవరం (07189) ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 6.23 గంటలకు కోవెలకుంట్లకు, 7.30 గంటలకు ప్రొద్దుటూరుకు చేరుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ధర్మవరం నుంచి నాందేడ్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 1.58 గంటలకు, కోవెలకుంట్ల రైల్వేస్టేషన్ 3.18 గంటలకు చేరుతుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐసీడీఎస్ పీడీ బాధ్యతల స్వీకరణ



పీడీకి శుభాకాంక్షలు చెబుతున్న సీడీపీఓలు

పుట్టపర్తి అర్బన్: సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులైన ప్రమీల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా పుత్తూరులో సీడీపీఓగా పనిచేస్తున్న ఆమెకు ప్రభుత్వం ఇటీవలే పదోన్నతి కల్పించి జిల్లా పీడీగా బదిలీ చేసింది. అలాగే ఇప్పటి వరకూ ఇక్కడ పీడీగా పనిచేసిన శ్రీదేవిని తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేసింది. పీడీగా బాధ్యతలు తీసుకున్న ప్రమీలకు సీడీపీఓలు గాయత్రి, నాగమల్లేశ్వరి, రాధిక, ధనలక్ష్మి, శాంతలక్ష్మి, వై.లక్ష్మి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పీఏబీఆర్‌లోకి కృష్ణాజలాలు



గంగపూజ చేస్తున్న అధికారులు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లోకి హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను శుక్రవారం మళ్లించారు. రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీటి వద్ద డీఈఈ వెంకటరమణ గంగపూజ నిర్వహించారు. తొలి రోజు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డీఈఈ తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.82 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. కృష్ణాజలాల రాకతో రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈలు లక్ష్మీదేవి, ముత్యాలప్ప, గంగమ్మ, రేణుక పాల్గొన్నారు.

తడబడిన తొలి అడుగు

కూటమి సర్కారు ఏడాది పాలనపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేపట్టిన 'సుపరిపాలన–తొలి అడుగు' కార్యక్రమం అభాసుపాలైంది. తొలి అడుగు తడబడుతూ నడుస్తోంది. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు జనంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. సాధారణంగా ఎన్నికల ముందు జనంలోకి వెళ్లాలంటే వ్యతిరేకతతో వెళ్లలేకపోతారు. కానీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది తిరక్కుండానే జనం చేత తిరస్కరణకు గురవుతుండటం వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.



అనంతపురంలో రేషన్ కోసం క్యూలో సంచులు పెట్టి పడిగాపులు కాస్తున్న మహిళలు (ఫైల్)

ఏడాది పాలనపై ఎమ్మెల్యేలకు ఆదరణ కరువు

- మంత్రులు పర్యటనలకు వెళ్లినా స్పందన అంతంతే
- అర్బన్ ప్రాంతాల్లో సమస్యలపై జనం ఏకరువు
- విచ్చలవిడి మద్యం అమ్మకాలపై మహిళల మండిపాటు
- కొన్నిచోట్ల తాగునీటి అవసరాలూ తీర్చలేని పాలనపై ఆగ్రహం

బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ

కూటమి సర్కారు వచ్చిన ఏడాదిలోనే చేసిన మోసాలపై 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలు ఇంటింటా తిరుగుతున్నారు. ఎక్కడికి వెళ్లినా నాయకుల వద్ద సామాన్యులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. కొత్త పెన్షన్లు లేవు, మద్యం విచ్చలవిడి అయ్యింది, కొత్త రేషన్ కార్డులు లేవు, ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు కావడం లేదు.. ఇలా ఒకటి కాదు సవాలక్ష సమస్యలను జనం ఏకరువు పెడుతున్నారు. ఈ కార్యక్రమానికి సామాన్యుల నుంచి బాగా మద్దతు లభిస్తున్నట్టు వెల్లడైంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలున్నాయి. ఇందులో 13 చోట్ల టీడీపీ, ఒక చోట బీజేపీ గెలిచింది. ప్రజాప్రతినిధులు ఏ నియోజకవర్గానికి వెళ్లినా ప్రజలు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. 'సుపరిపాలన' ఎక్కడ చేశారంటూ నిలదీస్తున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తొలి అడుగు కార్యక్రమానికి వెళ్లినప్పుడు రేషన్ సరుకులకు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, గతంలో ఇంటివద్దకే తెచ్చి ఇచ్చేవారని వాపోయారు. కొంతమంది ఇంటిముందే పారుతున్న డ్రెయినేజీ చూపించి మున్సిపాలిటీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మద్యం అమ్మకాలు విచ్చలవిడి అయ్యాయని కొంతమంది మహిళలు వాపోయారు.

మంత్రులకూ నిరసన సెగలే

ఎమ్మెల్యేలకే కాదు మంత్రులు వెళ్లినా నిరసన సెగ తాకుతోంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాయదుర్గం నియోజకవర్గంలో 'తొలి అడుగు' పర్యటనకు వెళ్తుండగా తాగునీటి కష్టాలను ఏకరువు పెడుతూ ఖాళీ బిందెలతో అడ్డుకున్నారు. మాకు తాగునీరు ఇప్పించాలని డిమాండ్ చేశారు. చివరకు అడ్డుకున్నందుకు ఆ మహిళలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసులు బెదిరించారు. అంతేకాదు గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కళ్యాణదుర్గం రాగా.. కొంత మంది ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలను గృహ నిర్బంధం చేశారు. మంత్రి వచ్చినా ఎక్కడా ఎవరినీ కలవకుండానే వెళ్లిపోయారు.



రాయదుర్గంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

హోం మంత్రి ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు

హోం మంత్రి వంగలపూడి అనిత ఇటీవల మడకశిర నియోజకవర్గానికి వచ్చారు. అక్కడ ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలు విని పరిష్కారం సూచిస్తారని అనుకున్నారు. కానీ అక్కడికొచ్చి స్థానిక ఎమ్మెల్యేను పొగిడి అలాగే వెళ్లిపోయారు. దీంతో సమస్యలు విన్నవించుకుందామనుకున్న ప్రజలకు నిరాశే ఎదురైంది. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితదీ ఇదే పరిస్థితి. నియోజవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉంది. కొంతమంది అనుచరులు మాత్రమే మట్టి, ఇసుక దందాలు చేసుకుంటున్నారు. దీంతో సామాన్యులు అల్లాడుతున్నారు.

అర్చకుడి ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న అర్చకులు

కదిరి టౌన్: కర్నూలు జిల్లా ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం అర్చకుడు పూజన్నస్వామి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అర్చకులు ఖాద్రీ ఆలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖాద్రీ దేవస్థానం అర్చకులు నరసింహాచార్యులు, కుమారస్వామి, సైదాపురం ఆంజనేయస్వామి అర్చకులు పాపయ్య శాస్త్రి తదితరులు మాట్లాడారు. ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరాజు వేధింపులతోనే అర్చకుడు పూజన్నస్వామి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని దేవదాయశాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్చక సమైక్య సంఘం కదిరి అధ్యక్షుడు బాబు ప్రకాష్, కార్యదర్శి జి.శివరాం, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల పనితీరు మెరుగుపడాలి

- వైద్యాధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: జిల్లాలోని ఆస్పత్రుల పనితీరు మరింత మెరుగుపడాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ చేతన్ అధ్యక్షతన జిల్లా స్థాయి నాణ్యతా ప్రమాణాల హామీ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఆస్పత్రుల పనితీరు మెరుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రుల్లో కల్పించాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. సేవల్లో నాణ్యతా ప్రమాణాలను పెంచేందుకు చేపట్టాల్సిన పనులు, వివిధ ఆస్పత్రుల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి సూచనలు చేశారు. అనంతరం కేంద్రం సర్టిఫై చేసిన ఆసుపత్రులకు అవార్డులు అందజేశారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని 26 ఆస్పత్రులు, డీసీహెచ్‌ఎస్ పరిధిలోని రెండు ఆస్పత్రులకు అవార్డులిచ్చారు. ఈ సందర్భంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ టీఎస్ చేతన్ విడుదల చేశారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మధుసూదన్, పలువురు డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

లింగ నిష్పత్తిలో అసమానతలు తొలగించాలి

లింగ నిష్పత్తిలో అసమానతలు తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలనపై జిల్లా అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభాలో బాలురతో పోలిస్తే బాలికల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. ఈ అసమానతలు తొలగించి సమాజంలో ఆడపిల్లల సంఖ్యను పెంచాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యల గురించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కుటుంబంలో ఎవరైనా ఆడపిల్ల వద్దని వేధిస్తున్నా తమకు తెలపాలన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగనిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై, ఆయా కేంద్రాల్లో పనిచేసే వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు కఠినంగా శిక్షించాలన్నారు. గర్భస్రావాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, ఐసీడీఎస్ పీడీ ప్రమీల తదితరలు పాల్గొన్నారు.



ప్రపంచ తల్లిపాల వారోత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ చేతన్

పథకాల అమలులో లోటుపాట్లు

- సరిచేయాలని కలెక్టర్‌కు సూచించిన కేంద్రం బృందం

ప్రశాంతి నిలయం: గ్రామీణ అభివృద్ధి పనుల పర్యవేక్షణ, వివిధ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు వచ్చిన కేంద్రం బృందంతో కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం భేటీ అయ్యారు. జూలై 25వ తేదీ నుంచి శుక్రవారం వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం ప్రతినిధి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎంఏవై, ఎన్ఎస్ఏపీ, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం తదితర పథకాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. పథకాల అమలు బాగానే ఉన్నా... చిన్నపాటి లోటు పాట్లు ఉన్నాయని, వాటిని సరిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ చేతన్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. బృందం సభ్యులు చెప్పిన సూచనలు పాటించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు చూడామణి రెడ్డి, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి సమత, భూగర్భ జలశాఖ డీడీ రాజశేఖర్, సర్వే ల్యాండ్ ఏడీఈ విజయశాంతి బాయి పాల్గొన్నారు.

వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించండి

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రాయల్, రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల అమర్‌నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాము నాలుగు రోజులుగా జిల్లాలోని పలు వసతి గృహాలను సందర్శించామన్నారు. ఏ వసతి గృహానికి వెళ్లినా సమస్యలే కనిపించాయన్నారు. మెనూ పాటించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి గృహాల్లో తాము గుర్తించిన సమస్యలను వివరించి... పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరుపులు, ప్లేట్లు, దుప్పట్లు, గ్లాసులు, ట్రంకు పెట్టెలు అందివ్వాలని కోరామన్నారు. అలాగే విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు కీలకమైన వార్డెన్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగంగా జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కదిరి రూరల్ అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు మానేరు నరసింహులు, పవన్ కుమార్‌రెడ్డి, కౌశిక్ మేఘనాథ్ అనిల్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు


ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం–సెప్టెంబరు–5)ని పురస్కరించుకుని అందజేసే రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు అర్హులైన టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, ఏపీఎంఎస్, ఏపీఎస్ డబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీఆర్‌ఈఐఎస్, కేజీబీవీ, డైట్ కళాశాల టీచర్లు ఈ అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు (మూడు సెట్లు) ఈ నెల 8లోగా సంబంధిత డీవైఈఓ/ఎంఈఓలకు అందజేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను డీవైఈఓలు, ఎంఈఓలు పరిశీలించి రిమార్కులు నమోదుచేసి 12లోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు అనంతపురం బ్లాగ్ స్పాట్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు.

పింఛన్ అందకుండా 'పచ్చ' కుట్ర

- అధికారం అండతో అధికారులకు బెదిరింపులు
- రాజకీయ కక్షతో రెండు నెలలుగా పింఛన్ నిలిపివేసిన వైనం
- బాధితులు కలెక్టర్‌ను కలిసినా... మూడో నెలలోనూ అదే తంతు

ఓడీచెరువు: రాజకీయ కక్షతో అర్హులకూ పింఛన్ అందకుండా పచ్చ నేతలు కుట్ర చేస్తున్నారు. అధికార అండతో అధికారులను భయపెట్టి ఏ ఆసరాలేని పింఛన్‌దారులను కన్నీళ్లు పెట్టిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కొండకమర్ల పంచాయతీ చెరువు మునెప్పపల్లికి చెందిన సి.శ్రీనివాసరెడ్డి, సి.చిన్నపరెడ్డి, ఇ. వెంకటశివారెడ్డి సెప్టెంబరు 2023 నుంచి వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీరి పింఛన్లను రద్దు చేయించాలని స్థానిక టీడీపీ నాయకులు కుట్ర చేశారు. ఇందు కోసం వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోకపోతే పింఛన్ రద్దవుతుందని తెలుసుకుని ఆ దిశగా ప్లాన్ వేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిని భయపెట్టి సి సి.శ్రీనివాసరెడ్డి, సి.చిన్నపరెడ్డి, ఇ. వెంకటశివారెడ్డికి రెండు నెలలుగా పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నారు. దీంతో బాధితులు జూలై 28న జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్ చేతన్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన కలెక్టర్ అధికారులను మందలించారు. అర్హులందరికీ పింఛన్ ఇవ్వాలని ఆదేశించారు. అయినప్పటికీ తాజాగా ఆగస్టు (మూడో నెల) పింఛన్ వారికి పంపిణీ చేయలేదు. ఎందుకని ప్రశ్నిస్తే..'ఇస్తాంలే' అంటూ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. బాధితుల పింఛన్ ఐడీ ద్వారా ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే వారి మూడు నెలల పింఛన్ మొత్తం అందులో కనిపిస్తోంది. ఇదే విషయంపై వివరణ కోరేందుకు 'సాక్షి' పలుమార్లు ప్రయత్నించినా పంచాయతీ కార్యదర్శి అందుబాటులోకి రాలేదు. ఎంపీడీఓ మాత్రం తాను ఎవరి పింఛన్లు ఆపలేదని తెలిపారు. రాజకీయ కక్షతో తమకు పింఛన్ పంపిణీ చేయకుండా నిలిపివేయడం దుర్మార్గమని బాధితులు వాపోయారు.



Forwarded
Status - LIVE
District - SRI SATHYA SAI
Mandal - Obuladevaracheruvu
Secretariat Code - 11290816
Secretariat Name - KONDAKAMARLA2
Pension ID - 12500040809
Pensioner Name - Cheruvu Sreenivasa Reddy
Pension Type - O.A.P
Amount - 12000
Mobile Number - None
Paid User ID - None
Paid User Name - None
Date of Disbursement -
Mode of Payment - None

శ్రీనివాసరెడ్డి పింఛన్ ఐడీలో చూపుతున్న మూడు నెలల పింఛన్ మొత్తం

పంపిణీ రెండురోజులే!

- సకాలంలో తీసుకోకపోతే పింఛన్ కోసం నెలరోజులు ఆగాల్సిందే
- కూటమి సర్కార్ తీరుపై పింఛన్‌దారుల పెదవి విరుపు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి, వలస జీవులకు పింఛన్ కష్టమే!

పుట్టపర్తి అర్బన్: పింఛన్ పంపిణీపై కూటమి సర్కార్ ఆంక్షలు విధించింది. రెండు రోజులు మాత్రమే గడువు విధించింది. 1, 2 తేదీల్లో ఏదైనా కారణంతో పింఛన్ అందుకోకపోతే మరుసటి నెలలో పింఛన్ మొత్తం అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో వివిధ జబ్బులతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు, బతుకుదెరువుకు వలస వెళ్లిన వారు..పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల కోసం బంధువుల ఊళ్లకు వెళ్లిన వారికి పింఛన్ మొత్తం అందని పరిస్థితి నెలకొంది. కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయంపై లబ్ధిదారులంతా పెదవి విరుస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందించేవారని గుర్తు చేసుకుంటున్నారు.

టీడీపీ నేతల ఇళ్ల వద్ద పింఛన్ పంపిణీ!

జిల్లాలో 2,64,665 మంది పింఛన్ లబ్ధిదారులుండగా... శుక్రవారం సచివాలయ, రైతు సేవా కేంద్రాలు, వెలుగు సిబ్బంది సుమారు 4 వేల మంది సాయంత్రానికి 2,45,009 మందికి పింఛన్ మొత్తం అందించారు. ఇంకా దాదాపు 20 వేల మంది పింఛన్ అందుకోలేకపోయారు. వీరంతా శనివారం అందుబాటులో ఉండి పింఛన్ మొత్తం తీసుకోవాలి. లేకపోతే 30 రోజులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా, శుక్రవారం చాలా గ్రామాల్లో టీడీపీ నాయకుల ఇళ్లవద్దే పింఛన్ పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల మాత్రం సచివాలయాలు, రచ్చకట్టల వద్ద పింఛన్ మొత్తం అందజేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బదిలీలతో ఇబ్బందులు..

సాధారణ బదిలీల్లో భాగంగా సచివాలయ ఉద్యోగులంతా గతనెలలో కొత్త స్థానాలకు వచ్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారు. వారి ఇళ్లు ఎక్కడ అని తెలుసుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలోనే టీడీపీ నాయకులు తమ ఇళ్ల వద్దకు పిలవడంతో సిబ్బంది అక్కడికే వెళ్లి పింఛన్ అందించారు.



పెదపల్లిలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

మార్గదర్శకాల మేరకే..

పింఛన్ పంపిణీకి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ప్రతి నెలా 1,2 తేదీల్లో పింఛన్ పంపిణీ చేస్తాం. ఆయా రోజుల్లో పింఛన్ తీసుకోని వారికి తర్వాత నెల అందిస్తాం. అందువల్ల లబ్ధిదారులంతా అందుబాటులో ఉండి పింఛన్ తీసుకోవాలి. – నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

కోతలతో ఏడి 'పింఛన్'

- ఇష్టారాజ్యంగా పింఛన్ పునఃపరిశీలన నోటీసులు
- ఓ జబ్బుతో బాధపడుతుంటే మరో జబ్బుతో నోటీసు
- తీరా ఆస్పత్రికి వెళ్లాక అందుబాటులో లేని వైద్యుడు
- లబ్ధిదారులపైనే నెపం మోపుతూ పింఛన్ నిలిపివేత

నల్లమాడ: అధికారుల తప్పిదం పింఛన్‌దారులకు శాపంగా మారింది. పింఛన్ల పునఃపరిశీలన పేరుతో జారీ చేసిన నోటీసును ఇష్టానుసారం తయారు చేశారు. పింఛన్‌దారుడు ఓ జబ్బుతో బాధపడుతుంటే మరో జబ్బు నమోదు చేసి నోటీసు ఇచ్చారు. ఆ నోటీసు తీసుకుని పింఛన్‌దారుడు ఆస్పత్రికి వెళ్లగా... సంబంధిత వైద్యుడు అందుబాటులో లేక పునఃపరిశీలన చేయించుకోలేకపోయారు. ఇదే అదనుగా ప్రభుత్వం వారికి పింఛన్ నిలిపివేసింది.

పింఛన్ రద్దుచేసే కుట్ర..

వివిధ కారణాలను సాకుగా చూపి ఇప్పటికే వేలాది మందిని పింఛన్‌కు అనర్హులుగా చూపిన కూటమి సర్కార్..తాజాగా పునఃపరిశీలన పేరుతో మరికొందరి పింఛన్‌ను నిలిపివేసింది. వాస్తవానికి పింఛన్ రద్దుచేసే కుట్రతోనే కూటమి సర్కార్ దివ్యాంగులు, వివిధ జబ్బులతో బాధపడుతున్న వారి పింఛన్‌ల పునఃపరిశీలన చేపట్టింది. ఇందుకోసం లబ్ధిదారులకు నోటీసు జారీ చేసి నోటీసులో పేర్కొన్న రోజున ఆస్పత్రికి వెళ్లి పునఃపరిశీలన పూర్తి చేయాలని పేర్కొంది. అయితే అధికారులు కంటి సమస్యతో బాధపడుతున్న వారిని చెవిటి వారుగా, కాళ్లు విరిగిన వారిని అంధత్వంతో బాధపడుతున్న వారిగా పేర్కొంటూ నోటీసులు ఇచ్చారు. దీంతో పింఛన్ లబ్ధిదారులు ఆ నోటీసు తీసుకుని ఆస్పత్రికి వెళ్తే తమ జబ్బును నిర్ధారించే వైద్యుడు అందుబాటులో లేరు. ఇలా అంధత్వంతో బాధపడుతున్న ఓ లబ్ధిదారుడు ఆస్పత్రి వెళ్లగా ఇక్కడ ఆర్థో వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో ఆస్పత్రి వారు అతన్ని వెనక్కి పంపారు. మరోసారి నోటీసు పంపుతారని అతను వేచి చూసినా ఫలితం లేకపోయింది. తాజాగా ఇలాంటి వారందరి పింఛన్లను ప్రభుత్వం నిలిపివేసింది. కారణమడిగితే పునఃపరిశీలనకు హాజరుకాలేదని పేర్కొంది. దీంతో పింఛన్ లబ్ధిదారులంతా లబోదిబోమంటున్నారు. ఇలాంటి వారు నల్లమాడ మండలంలోనే 20 మందికిపైగా ఉన్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా వేలల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. పింఛన్ అందని వారి జాబితాను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మండల స్థాయి అధికారులు చెబుతున్నారు.



పింఛన్ డబ్బు కోసం నల్లమాడ–1 సచివాలయంలో వేచి ఉన్న లబ్ధిదారులు

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న దృశ్యం

హిందూపురం టౌన్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక జీఆర్పీ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ధర్మవరం జీఆర్పీ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ సజ్జప్ప, ధర్మవరం ఆర్పీఎఫ్ ఎస్ఐ రోహిత్ గౌడ్, హిందూపురం ఎస్ఐ సాయినాథరెడ్డి వెల్లడించారు. రైళ్లలో చోటు చేసుకున్న చైన్‌స్నాచింగ్‌లకు సంబంధించి కేసులు నమోదు చేసిన రైల్వే పోలీసులు విస్తృత దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం హిందూపురంలోని రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం 2లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఒడిశాలోని బారకం గ్రామానికి చెందిన బినోత్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో చైన్‌స్నాచింగ్‌ల అంశం వెలుగు చూసింది. ధర్మరం సర్కిల్ పరిధిలోని హిందూపురం ఆర్పీఎస్‌లో మూడు కేసులు, ధర్మవరం ఆర్పీఎస్‌లో రెండు కేసులు, కదిరి ఆర్పీఎస్‌లో ఒక కేసులో నిందితుడిగా గుర్తించి 75 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

'ఆ టీచర్ మా కొద్దు'



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ముదిగుబ్బ: మండలంలోని బ్రహ్మదేవరమర్రి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వి. రోజారాణి తమకొద్దంటూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి కేటాయించిన ఉపాధ్యాయురాలు విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు. సమయపాలన పాటించడం లేదన్నారు. పాఠశాలలోనే నిద్ర పోతుంటారన్నారు. గ్రామస్తులు ప్రశ్నిస్తే మా ఆయన పోలీస్, మీపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపుతానంటూ బెదిరింపులకు దిగుతోందని వాపోయారు. ఇలాంటి ఉపాధ్యాయులతో తమ పిల్లల విద్యాభివృద్ధి కుంటుపడుతుందని, ఆమెను బదిలీ చేసి, మరో ఉపాధ్యాయుడిని నియమించాలంటూ కోరారు. దీనిపై స్పందించిన ఎంఈఓ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

తేలు కుట్టి యువకుడి మృతి

గుంతకల్లు రూరల్: మండలంలోని దంచర్ల గ్రామానికి చెందిన కొట్టం రామాంజనేయులు కుమారుడు శివ (30) తేలు కుట్టడంతో మృతి చెందాడు. వ్యవసాయ పనులతో కుటుంబానికి చేదోడుగా ఉన్న శివకు 18 నెలల క్రితం వివాహమైంది. శుక్రవారం పొలం పనులు చేస్తున్న సమయంలో తేలు కుట్టింది. గుర్తించిన బాధితుడు వెంటనే తేలును చంపేశాడు. నొప్పి ఎక్కువగా ఉండడంతో ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు తెలపడంతో వారు గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్స అందేలోపు శివ మృతి చెందాడు.

దారితెన్నూ లేని పనులు

సా...గుతున్న ఎన్‌హెచ్-342 పనులు

- వందరోజుల్లో సత్యసాయి శత జయంతి
- బెంగళూరు మార్గం నుంచే లక్షలాది మంది రాక
- అప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలంటున్న స్థానికులు



గంటల మారెమ్మ కనుమ వద్ద జరుగుతున్న పనులు



చిత్రావతి నదిపై పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి పనులు

పుట్టపర్తి అర్బన్: జాతీయ రహదారి-342 పనులు దారీతెన్నూ లేకుండా సా...గుతున్నాయి. ప్రజాప్రతినిధులు పట్టించుకోక... అధికారుల నిర్లక్ష్యం వెరసి రహదారి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ మార్గం అందుబాటులోకి వస్తే బెంగళూరు నుంచి జిల్లా కేంద్రం పుట్టపర్తికి రెండుగంటల్లో చేరుకోవచ్చు. సత్యసాయి జయంత్యుత్సవాల నేపథ్యంలో ఈ మార్గం తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. బాబా శత జయంత్యుత్సవాలకు విదేశాల నుంచి వచ్చే భక్తులు విమానంలో బెంగళూరు విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ప్రశాంతి నిలయం చేరుకుంటారు. కానీ ఈ రహదారి బాబా జయంత్యుత్సవాలకు అందుబాటులో వచ్చేలా కనిపించడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రారంభం..

పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటయ్యాక జిల్లా కేంద్రానికి కనెక్టివిటీ పెంచి తద్వారా పారిశ్రామికంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ హయాంలో ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల మీదుగా చిలమత్తూరు మండలం కోడూరు వరకూ నూతనంగా నాలుగు వరుసల రహదారికి (ఎన్‌హెచ్-342) రూపకల్పన చేసి పనులు కూడా ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో పనులు శరవేగంగా జరిగాయి. చిత్రావతిపై బ్రిడ్జి, గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో పాటు కర్ణాటకనాగేపల్లి వద్ద , వెంగళమ్మచెరువు ప్రధాన రహదారిపై బ్రిడ్జిల నిర్మాణం ఊపందుకుంది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత పనులు నెమ్మదించాయి.

రూ.1,745 కోట్లతో రోడ్డు నిర్మాణం..

ముదిగుబ్బ నుంచి ప్రారంభమయ్యే జాతీయ రహదారి-342 చిలమత్తూరు మండలం కోడూరు వరకు మొత్తం రోడ్డు 80 కిలోమీటర్ల పొడవు ఉంది. ఇందుకోసం రూ.1,745 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ముదిగుబ్బ - బుక్కపట్నం మధ్య 85 శాతం పనులు పూర్తికాగా, ఆ రోడ్డుపై వాహనాలు తిరుగుతున్నాయి. రెండో విడత పనుల్లో భాగంగా జగరాజుపల్లి నుంచి కోడూరు వరకూ పనులు కొనసాగుతున్నాయి. 7 గ్రామాల్లో బైపాస్‌లతో పాటు బడేనాయక్ తండా వద్ద ఉన్న నల్లగుట్ట, పుట్టపర్తి వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అలాగే గువ్వల గుట్టపల్లి వద్ద రైతుల భూములకు పరిహారం సకాలంలో అందక పోవడంతో అక్కడ పనులకు బ్రేక్ పడింది.

బెంగళూరు నుంచి భారీగా భక్తులు వచ్చే అవకాశం

సత్యసాయి శత జయంత్యుత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారు. అలాగే ప్రధానమంత్రి, రాష్ట్రపతి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్‌లు విచ్చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దేశంలో నుంచి ఏ రాష్ట్రం నుంచి రావాలన్నా... విదేశాల నుంచి రావాలన్నా అందరూ బెంగళూరు విమానాశ్రయం వచ్చి అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ప్రశాంతి నిలయం చేరుకుంటారు. అంతేకాకుండా బెంగళూరులో సత్యసాయి బాబా ఆశ్రమం కూడా ఉంది. అందువల్ల ఈ మార్గమే అందరికీ అనుకూలంగా ఉంది. అలాగే తమిళనాడు నుంచి వచ్చే భక్తులు కూడా బెంగళూరు మీదుగానే ప్రశాంతి నిలయం వస్తారు. దీంతో బాబా శతజయంత్యుత్సవాల సమయంలో ఈ మార్గంపై రద్దీ పెరుగుతుంది. ప్రస్తుతం నిర్మిస్తున్న రోడ్డు పూర్తి కాకపోతే డైవర్షన్లు, మట్టి రోడ్డు, అసంపూర్తి పనులతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పుట్టపర్తి చుట్టూ నిర్మాణ పనులు సగం కూడా పూర్తి కాక పోవడం అందరినీ ఆందోళన కలిగిస్తోంది. బాబా శత జయంత్యుత్సవాల కోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టే పనులు శరవేగంగా సాగుతున్నా... ప్రధానమైన రహదారి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. దీంతో భక్తులంతా కూటమి సర్కార్‌ను తప్పుపడుతున్నారు. కనీసం ఇప్పటికైనా స్పందించి బాబా శత జయంత్యుత్సవాల నాటికి వీలైనంత వరకూ రోడ్డు మార్గాన్ని అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

భక్తులు ఇబ్బంది పడతారు



సత్యసాయి శతజయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి భక్తులు విచ్చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎన్‌హెచ్ -342 పూర్తి కాకపోతే వారంతా తీవ్ర ఇబ్బంది పడే అవకాశం ఉంది. రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా డైవర్షన్లు, ఎక్కడ చూసినా గుంతలు, రాళ్లు ఉంటాయి. దీంతో విదేశీ భక్తులు రావడానికి ఇబ్బంది పడతారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు వేగవంతం చేయాలి. – గురుప్రసాద్‌రెడ్డి, ప్రశాంతి గ్రామం

పనులు సాగలేదు



ఎన్‌హెచ్-342 పనులు రెండేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. బడేనాయక్ తండా వద్ద ఉన్న నల్లగుట్ట, పుట్టపర్తి వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం మా గ్రామాల వద్ద రహదారి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. బాబా శతజయంతి నాటికి రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్న నమ్మకం లేదు. అధికారులు ఇప్పటికైనా చొరవ చూపాలి. – రాంజీ నాయక్, బడేనాయక్ తండా

జయంతి వేడుకలకు పూర్తి చేస్తాం

సత్యసాయి బాబా శత జయంతి వేడుకల నాటికి రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. కోడూరు నుంచి జగరాజుపల్లి వరకూ చేపట్టాల్సిన పనులన్నీ అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. జగరాజుపల్లి నుంచి పుట్టపర్తి వరకూ పనులు ఆ తర్వాత చేస్తాం. – గిడ్డయ్య, ఎన్‌హెచ్-342 డీఈ

విద్యుత్ షాక్‌తో నెమలి మృతి



నెమలి కళేబరం

సోమందేపల్లి: మండలంలోని మరుకుంట సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ నెమలి మృతి చెందింది. శుక్రవారం వ్యవసాయ పొలాల్లో మేత కోసం వచ్చిన నెమలి అక్కడి విద్యుత్ స్తంభంపై కూర్చొనే క్రమంలో షాక్‌కు గురై కుప్పకూలి మృతి చెందింది. గమనించి రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

కిలో బంగారు ఆభరణాల సీజ్

తాడిపత్రి టౌన్: మండలంలోని కడప రోడ్డులో గురువారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టిన సమయంలో కిలో బరువున్న బంగారు నగలతో పాటు రూ.1.48 లక్షల నగదు పట్టుబడింది. సరైన అనుమతి పత్రాలు లేకుండా తాడిపత్రి నుంచి ప్రొద్దుటూరుకు కారులో నగలు, నగదు అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రొద్దుటూరుకు చెందిన నగల వ్యాపారి ఉభయ్‌దుల్లాతో పాటు ఆయన ఇద్దరు కుమారులు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, దాదాపు 1,123.92 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,48,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తు, నగదును కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

తల్లి పాల ప్రాముఖ్యతపై చైతన్య పరచండి

- ఐసీడీఎస్ పీడీ ప్రమీల



నవజాత శిశువు ఇంట్లో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న పీడీ ప్రమీల

పుట్టపర్తి అర్బన్: తల్లి పాల ప్రాముఖ్యతపై మహిళల్లో చైతన్యం తీసుకురావాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీల అన్నారు. శుక్రవారం పుట్టపర్తి మండలం బీడుపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. గ్రామంలోని పలువురు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. శిశువు జన్మించిన అనంతరం రెండేళ్ల పాటు క్రమం తప్పకుండా తల్లి పాలను కచ్చితంగా తాపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడవచ్చునన్నారు. అనంతరం నవజాత శిశువుల ఇళ్లకు వెళ్లి అంగన్‌వాడీ సేవలను తెలుసుకున్నారు. ఆకు కూరలు, కాయగూరలతో భోజనం చేయాలని సూచించారు. తల్లి పాల వారోత్సవాలకు గుర్తుగా రెండు ఇళ్ల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో చోరీ

రాయదుర్గం టౌన్: స్థానిక నూతన రైల్వే క్వార్టర్స్‌లో చోరీ జరిగింది. రైల్వే టీఆర్‌డీ (ట్రాక్షన్ అండ్ రిసోర్స్ డెవలప్‌మెంట్) వర్కర్‌గా పనిచేస్తున్న నాగేంద్ర ఇంత కాలం తాను అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి క్వార్టర్స్‌లో కేటాయించిన నూతన ఇంటికి గురువారం మొత్తం సామగ్రిని తరలించారు. అనంతరం శుక్రవారం నూతన గృహంలో చేరాలని అనుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అద్దె ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలసి నిద్రించారు. ఇదే అదనుగా భావించిన దుండగులు క్వార్టర్స్‌లోని ఇంటి తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బ్యాగుల్లోని బంగారు, వెండి సామగ్రితో పాటు కొంత మేర నగదు అపహరించారు. శుక్రవారం ఉదయం నూతన గృహంలో పూజాదికాలు చేసేందుకు సిద్ధమై వచ్చిన నాగేంద్ర కుటుంబసభ్యులు చోరీ విషయాన్ని గుర్తించి ఆందోళనకు గురయ్యారు. మొత్తం రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు కొంత నగదు అపహరించినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైస్ పుల్లింగ్ ముఠాపై కేసు నమోదు

నల్లమాడ: రైస్ పుల్లింగ్‌తో గుప్త నిధులు వెలికి తీయవచ్చునంటూ మభ్యపెట్టి వస్తువు విక్రయానికి పూనుకున్న ముఠా సభ్యులపై నల్లమాడ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మండలంలోని ఎద్దులవాండ్లపల్లి తండా వద్ద గురువారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొందరు కొత్త వ్యక్తులను తండావాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. పోలీసులకు అప్పగించిన వారిలో నల్లమాడ మండలం ఎద్దులవాండ్లపల్లి తండాకు చెందిన భాస్కర్‌నాయక్, ఖమ్మంకు చెందిన ఎండీ అక్బర్‌బాషా, ఎమ్మిగనూరుకు చెందిన ఆవుల ప్రసాద్, విజయవాడకు చెందిన కార్తికేయ చైతన్య, కనగానపల్లికి చెందిన సుంకర వీరన్న ఉన్నారు. ఓ బృందంగా ఏర్పడిన వీరికి భాస్కర్ నాయక్ నాయకుడిగా వ్యవహరిస్తున్నాడు. రైస్ పుల్లింగ్‌తో భూగర్భంలో ఉండే బంగారాన్ని గుర్తించి వెలికి తీయవచ్చని వీడియోలు ప్రదర్శిస్తూ ప్రజలను నమ్మించి రైస్ పుల్లింగ్‌లు విక్రయించి సొమ్ము చేసుకోవాలని పన్నాగం పన్నారు. ఇందులో భాగంగా గురువారం ఎద్దులవాండ్లపల్లి తండా వద్ద ఐదుగురు కలసి కార్యాచరణకు బయలుదేరుతుండగా అందిన సమాచారంతో సీఐ నరేంద్రరెడ్డి, సిబ్బంది అక్కడికి చేరుకుని ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఓ కారు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, నిందితులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.12 లక్షల నగదు అపహరణ

పావగడ: బ్యాంక్ నుంచి బయటకు వచ్చిన వ్యక్తి చేతిలో ఉన్న నగదు బ్యాగ్‌ను ఓ దుండగుడు లాక్కొని ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పావగడ సీఐ సురేష్ తెలిపిన మేరకు... పావగడ తాలూకా నాగలమడక హోబళి క్యాతగానకెరె గ్రామానికి చెందిన శ్రీనివాస్.. పావగడలోని మున్సిపల్ బస్టాండ్ వెనుక ఉన్న కర్ణాటక గ్రామీణ బ్యాంక్‌లోని తన ఖాతాలో రూ.12 లక్షల నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. నోట్ల కట్టలు అస్తవ్యస్తంగా ఉండడంతో వాటిని సరి చేసుకుని రావాలని ఖాతాదారుడికి బ్యాంకు క్యాషియర్ తెలిపాడు. దీంతో శ్రీనివాస్ ఆ నగదును ఓ బ్యాగ్‌లో ఉంచుకుని బ్యాంక్ బయటకు వచ్చి తన ద్విచక్ర వాహనాన్ని ఎక్కి వెళుతున్న సమయంలో అక్కడే కాపు కాసిన ఓ యువకుడు ఒక్క ఉదుటున ఆ బ్యాగ్ లాక్కొని ఉడాయించాడు. ఆ సమయంలో శ్రీనివాస్ కేకలు వేసినా ఫలితం లేకపోయింది. నగదు కాజేసిన యువకుడి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సాయంత్రం బ్యాంక్ వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. అందులో స్పష్టంగా నిక్షిప్తమై ఉన్న చోరీ దృశ్యాల ఫుటేజీను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ చోరీ గత సోమవారం జరిగినట్లు సీఐ సురేష్ తెలిపారు.

● బయటపడిన డొల్లతనం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. జగనన్న విద్యా కానుక పేరుతో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్, బూట్లు, ఇతర సామగ్రి ఏటా ఉచితంగా పంపిణీ చేశారు. అయితే ఈ పథకంతో భారీగా ప్రజాధనం వృథా అవుతోందని, నాసిరకం కిట్లను పంపిణీ చేస్తున్నారని అప్పటి ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపణలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన కిట్‌ను అందజేస్తామని గొప్పలకు పోయారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత విద్యార్థులకు అందజేసిన కిట్లలోని డొల్లతనం కాస్త బయటపడింది. విద్యార్థులకు అందజేసిన బ్యాగ్‌లు రెండంటే రెండే రోజుల్లో చిరిగిపోయి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం




కూటమి ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ బ్యాగులు నాణ్యతగా లేవని చూపుతున్న అనంతపురంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

అక్కాతమ్ముడిపై దాడి

రాప్తాడు రూరల్: రస్తా విషయంగా చోటు చేసుకున్న వివాదంలో అక్క, తమ్ముడిపై దాడి చేసిన ఘటన శుక్రవారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. సోములదొడ్డి గ్రామానికి చెందిన కె.నారాయణరెడ్డికి కుమారులు కె.రామసుబ్బారెడ్డి, కె.బ్రహ్మానందరెడ్డి, కుమార్తె కమలమ్మ ఉన్నారు. వీరు నివాసం ఉంటున్న ఇంటి పక్కనే 22 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. వీరి ఇంటి వెనుక నాగిరెడ్డి, రామలక్ష్మి, మదన్‌మోహన్‌రెడ్డి కుటుంబాలు ఉన్నాయి. నారాయణరెడ్డికి చెందిన 22 సెంట్ల స్థలంలో నుంచే ఆ ఇళ్లకు దారి ఉందంటూ ఆ కుటుంబాలు కొద్ది రోజులుగా గొడవ చేస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఖాళీ స్థలంలో పెరిగిన కంపచెట్లను తొలిగించేందుకు నాగిరెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, రామలక్ష్మి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు కొడవళ్లు, గొడ్డళ్లతో వెళ్లారు. సమాచారం అందుకున్న నారాయణరెడ్డి కుమారులు రామసుబ్బారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కమలమ్మ వెళ్లి అడ్డుకున్నారు. తమ స్థలంలో ఎందుకు చెట్లు తొలగిస్తున్నారంటూ ప్రశ్నించడంతో వివాదం చెలరేగింది. ఆ స్థలం తమదంటూ మారణాయుధాలతో నాగిరెడ్డి కుటుంబసభ్యులు దాడికి పాల్పడ్డారు. గొడ్డలితో దాడి చేయడంతో కమలమ్మ, బ్రహ్మానందరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. రామసుబ్బారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంతలో గ్రామస్తులు జోక్యం చేసుకుని సర్దిచెప్పి పంపారు. గాయాలపాలైన కమలమ్మ, బ్రహ్మానందరెడ్డి, రామసుబ్బారెడ్డిని సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరోప్ భక్తుల సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన యూరప్, యూకేలోని సత్యసాయి భక్తులు శుక్రవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరీ నిర్వహించి అలరించారు. సుమారు గంట పాటు భక్తిగీతాలతో వారు నిర్వహించిన కచేరీ భక్తులు మైమరచిపోయారు.

ఉపశమనం కాదు.. ప్రత్యక్ష నరకమే



ఈ వ్యక్తి పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి. ఎడమచేతికి కాలడంతో సర్వజనాస్పత్రికి వచ్చారు. కాగా ఓపీ నంబర్ 8లో సర్జరీ వైద్యులు చూసి సర్జికల్ వార్డుకు పంపించారు. వాస్తవంగా ఇటువంటి కేసులను బర్న్స్ వార్డులో ఉంచి మెరుగైన వైద్యం అందించవచ్చు. బర్న్స్ వార్డులో ఏసీలతో పాటు బయట వ్యక్తులు ఎవరూ లోపలికి రాకుండా అంతర్గతంగా సేవలందిస్తారు. తద్వారా గాయం త్వరగా మానే అవకాశం ఉంటుంది. ఇలా ఎంతోమంది రోగులు సర్జరీ వార్డుల్లో ఉక్కపోతతో ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.

- కాలిన రోగుల హాహాకారాలు
- వార్డుల కేటాయింపులో గందరగోళం
- ఇదీ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో దుస్థితి



సర్వజనాస్పత్రిలోని బర్న్స్ వార్డు



బర్న్స్ వార్డులో ఈఎన్‌టీ రోగులను ఉంచిన దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఉన్నతాధికారుల అవగాహన రాహిత్యం రోగులకు నరకప్రాయంగా మారుతోంది. కోవిడ్ ముందస్తు చర్యల కోసం ఈఎన్‌టీ వార్డును కేటాయించి.. ఇక్కడి రోగులను బర్న్స్ వార్డుకు మార్పు చేశారు. ఇక కాలిన రోగుల వైద్య విభాగం (బర్న్స్ యూనిట్)లో చికిత్స పొందాల్సిన రోగులను సర్జికల్ విభాగంలోని ఎంఎస్ 1, 2, 3, 4, 5, ఎఫ్ఎస్ వార్డులకు మార్చారు. ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో ఉపశమనం పొందలేక.. హాహాకారాలు చేస్తున్నారు. కోవిడ్ కేసులు వస్తే చికిత్స అందించేందు కోసం ఖాళీ చేయించిన ఈఎన్‌టీ వార్డును రిజర్వ్ చేశారు. ఇదిలా ఉంటే సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం బర్న్స్ వార్డులోని ఆపరేషన్ థియేటర్(ఓటీ)ను అనస్తీషియా విభాగానికి కేటాయించడం పెద్ద దుమారం రేపింది. ఈ నిర్ణయంపై సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ రామస్వామి నాయక్ అభ్యంతరం తెలిపారు. కాలిన రోగులకు ఉపయోగపడే ఓటీని మరో విభాగానికి కేటాయించడం సరికాదని, ఇప్పటికే కాలిన రోగులు ఇబ్బందులు పడుతున్నారని లేఖ రాశారు. సూపరింటెండెంట్ సొంత విభాగం ఆర్థో ఓటీలోనే అనస్తీషియాకు స్థలం కేటాయిస్తే బాగుంటుందని పలువురు వైద్యులు పేర్కొంటుండటం గమనార్హం.

ఉక్కపోతతో కాలిన రోగుల అవస్థలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కడైనా ప్రమాదాలు, ఆత్మహత్యాయత్నం చేసుకున్న కాలిన కేసులు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వస్తాయి. అందులోనూ 50 శాతం నుంచి 80 శాతం కాలి ప్రాణాంతకమైన స్థితిలో వస్తుంటాయి. అటువంటి బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.2 కోట్లతో 20 పడకల సామర్థ్యంతో బర్న్స్ వార్డు ఏర్పాటు చేశారు. అందులో అధునాత ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఏసీ గదులతో వార్డును తీర్చిదిద్దారు. కాలిన కేసులకు మెరుగైన వైద్యం అందించేందుకు సర్జరీ వైద్యులకు ఢిల్లీలో శిక్షణ కూడా ఇచ్చారు. అత్యవసరమైన వార్డును ఈఎన్‌టీకి కేటాయించి, ఈఎన్‌టీ వార్డును ఖాళీగా ఉంచేశారు. సర్జరీ విభాగంలో ఉక్కపోత కారణంగా కాలిన రోగులు విలవిలలాడిపోతున్నారు. ఇప్పటికైనా రోగుల అవస్థలను గుర్తించి ఇదివరకు ఎలా ఉందో అలా సంబంధిత విభాగంలోనే వైద్య సేవలందించాలని పలువురు కోరుతున్నారు. అసంబద్ధ నిర్ణయాలతో రోగుల ప్రాణాలతో చెలగాటమాడ వద్దని ఉన్నతాధికారులకు సూచిస్తున్నారు.